

డిగ్రీ విద్యార్థులపై ఫీజుల భారం
కేయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ఫీజులు విద్యార్థుల పాలిట గుదిబండగా మారాయి. ఈ ఏడాది నుంచి ప్రత్యేక ఫీజులు మూడు రేట్ల వరకు పెంచడం గమనార్హం. 8లో ▸



ఎమ్మెల్యేను నిలదీసిన గ్రామస్తులు
లోకేశ్వరం మండలం పిప్రి గ్రామంలో ముధోల్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డిని గ్రామస్తులు అడ్డుకున్నారు. పిప్రి ఎత్తిపోతల పథకంపై పనుల గురించి నిలదీశారు. 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.8 /21.3
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. గాలిలో తేమశాతం పెరిగి వాతావరణం చల్లగా ఉంటుంది. అక్కడక్కడా చినుకులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

భైంసాటౌన్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి అన్నారు. భైంసాలోని పిప్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతోపాటు కస్తూరిబా బాలికల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తొలిమెట్టు కార్యక్రమ అమలు తీరు, విద్యార్థుల వర్క్‌బుక్కులు, బోధనోపకరణాలు, రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు నిర్మల్‌కు విజయశాంతి రాక

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, సినీనటి విజయశాంతి శనివారం నిర్మల్‌కు రానున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నిర్మల్ నియోజకవర్గ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు తెలిపారు. హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్మల్ చేరుకుంటారని పేర్కొన్నారు. 1:30 గంటలకు సారంగాపూర్‌లో, 2:15 గంటలకు బీరవెల్లిలో, 3 గంటలకు దిలావర్‌పూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని వివరించారు.

చిట్యాల పాఠశాలలో జీవ పరిణామ దినోత్సవం



మాట్లాడుతున్న నరసయ్య

నిర్మల్ రూరల్: మండలంలోని చిట్యాల ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ జీవ పరిణామ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య మాట్లాడారు. అనేక సాక్ష్యాలు, ఆధారాలతో రుజువు చేయబడ్డ సిద్ధాంతం జీవపరిణామ సిద్ధాంతమని పేర్కొన్నారు. విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకుని దానిని అర్థం చేసుకోవాలన్నారు. శాస్త్రీయ దక్పథం ఏర్పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్, పోతన్న, వహీద్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మాలల మద్దతు బీఆర్‌ఎస్‌కే

- తెలంగాణ మాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్



మాట్లాడుతున్న చెరుకు రాంచందర్

నిర్మల్‌టౌన్: రాష్ట్రంలో మాలల సమస్యలు పరిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకే ఈ ఎన్నికల్లో మద్దతు తెలపాలని, నిర్మల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని తెలంగాణ మాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమే అని తెలిపారు. హైదరాబాద్ నడి ఒడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని స్థాపించడం హర్షనీయమన్నారు. దళితబంధు పథకం దళితులు వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో వచ్చి హడావుడి చేసే కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మి మోసపోవద్దని కోరారు. సమావేశంలో తెలంగాణ మాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ కనకరాజు, వైస్ చైర్మన్ అనిల్, కోచైర్మన్ మాధవరావు, బీసీ సంక్షేమ జిల్లా అధ్యక్షుడు అనుముల భాస్కర్, నిర్మల్ బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'నమో' నిర్మల్!





సభాప్రాంగణం ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న బీజేపీ నిర్మల్ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నాయకులు

- రేపు జిల్లాకు ప్రధాని రాక
- పట్టణంలో బీజేపీ బహిరంగ సభ
- భారీగా ఏర్పాట్లు చేయిస్తున్న 'ఏలేటి'
- లక్షకుపైగా జన సమీకరణకు కసరత్తు
- ప్రచారంపై మోదీ పర్యటన ప్రభావం

నిర్మల్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జిల్లాలో హోరెత్తుతోంది. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నువ్వా నేనా అన్నట్లుగా ప్రచారం సాగిస్తున్నాయి. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో బీజేపీకి గెలుపు అవకాశాలు ఉండడంతో కమలనాథులు ఈ జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. ఈ క్రమంలో గెలుపు అవకాశాలను మెరుగు పరిచేందుకు ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీ రంగంలోకి దిగుతున్నారు. ఆ స్థాయి వ్యక్తి తొలిసారి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వస్తున్నారు. ఆదివారం నిర్మల్ జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న బహిరంగసభలో ఆయన పాల్గొననున్నారు. తొమ్మిదేళ్ల నుంచి దేశ ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీ తొలిసారి రానుండటంతో ఆయనను చూసేందుకు స్థానిక ప్రజలు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా వస్తున్నప్పటికీ దేశ ప్రధానమంత్రిని స్వయంగా చూడాలన్న ఆసక్తితోనూ చాలామంది సభకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల బీజేపీ శ్రేణులు భారీగా తరలివచ్చేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు.

మోదీ.. తొలిసారి

గతంలో ఎప్పుడో నిర్మల్ పక్కనే ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు శంకుస్థాపనకు తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వచ్చారు. అప్పుడు జిల్లావాసులూ ఆయనను చూసేందుకు తండోపతండాలుగా తరలివెళ్లారు. ఆ తర్వాత కొన్నేళ్లకు ఇందిరాగాంధీ నిర్మల్ వచ్చారు. వారి తర్వాత చాలా ఏళ్లకు ప్రధాని హోదాలో పీవీ.నర్సింహారావు బాసర, నిర్మల్‌కు వచ్చారు. అప్పుడూ భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. ఇక తొమ్మిదేళ్లుగా ప్రధానమంత్రిగా ఉంటూ దేశవిదేశాల్లో పేరుప్రఖ్యాతలు తీసుకువచ్చిన నరేంద్రమోదీ తొలిసారి నిర్మల్‌కు వస్తున్నారు. ప్రధానమంత్రి హోదాలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రావడమే తొలిసారి కానుంది.

లక్ష జన సమీకరణ లక్ష్యంగా..

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం ఉదయం తుఫ్రాన్‌లో సభ ముగించుకున్న తర్వాత మధ్యాహ్నం నిర్మల్ సభకు చేరుకోనున్నారు. సమీకృత కలెక్టరేట్ వెళ్లే రోడ్డులో పాత క్రషర్ ఎదుట గల ఖాళీస్థలంలోనే ప్రధాని సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని ముధోల్, నిర్మల్, ఖానాపూర్ మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కనీసం లక్షమందిని సభకు తీసుకువచ్చేలా బీజేపీ నేతలు కసరత్తు చేస్తున్నారు. జిల్లాతోపాటు ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల నుంచి కూడా ప్రజలను తరలించేందుకు ప్లాన్ చేస్తున్నారు.

ప్రచారంపై ప్రభావం..

రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే బీజేపీ గెలిచే అవకాశాలు ఉన్న నియోజకవర్గాలు ఉమ్మడి ఆదిలబాద్ జిల్లాలోనే ఎక్కువగా ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి.

సభ సక్సెస్ కోసం..

వరుసగా రెండుసార్లు ఓటమిని మూటగట్టుకున్న నిర్మల్ బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఈసారి ఎలాగైనా గెలువాలన్న తపనతో ఉన్నారు. ఈక్రమంలోనే ఆయన కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఇప్పుడు తన ప్రచారానికి మద్దతుగా అన్నట్లు స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వస్తున్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని ఏలేటి చెబుతున్నారు. నిర్మల్ నియోజకవర్గం నుంచి భారీగా జనసమీకరణకు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ప్రధాని సభ ఏర్పాట్లనూ ఆయన స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ముధోల్ నుంచి రామారావుపటేల్, ఖానాపూర్ నుంచి రమేశ్‌రాథోడ్ జనసమీకరణ ఏర్పాట్లు చూసుకుంటున్నారు.

జిల్లాలోని నిర్మల్, ముధోల్, ఖానాపూర్, ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాలపై కమలదళం ఆశలు పెట్టుకుంది. మొత్తం ఐదు నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థులు ఉన్నారని, అలాగే ప్రస్తుతం బీజేపీ గాలి బలంగా వీస్తోందని అంచనా వేస్తున్నారు. ఇలాంటి సందర్భంలో ఎన్నికలకు ముందుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానుండటం తమకు మరింత కలిసి వస్తుందని ఆయా నియోజకవర్గాల అభ్యర్థులు భావిస్తున్నారు. ప్రజల్లోకి బీజేపీ మరింతగా వెళ్తుందన్న ఆశాభావంతో ఉన్నారు.

పనులకు విరామం.. ప్రచారంలో మమేకం!

- ఎన్నికల ప్రచారంలో కూలీలంతా బిజీబిజీ
- వ్యవసాయ, భవన నిర్మాణ పనులకు అంతరాయం

నిర్మల్ ఖిల్లా: నిర్మల్ నియోజకవర్గంలోని ఓ గ్రామంలో ఉదయం 8 గంటలకే ప్రధాన పార్టీ అభ్యర్థి రోడ్ షో కొనసాగుతోంది. అక్కడ దాదాపు 600 మంది జన సమీకరణలో భాగంగా ప్రచార రథం ముందర ఉన్నారు. అయితే ఆ కార్యక్రమం దాదాపు రెండు గంటల పాటు కొనసాగింది. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఎక్కడివారక్కడ వెళ్లిపోయారు. అక్కడ ఓ మహిళ తొందరగా కానివ్వండి.. మేము మరో సభకు వెళ్లాల్సి ఉంది. అంటూ కార్యక్రమ నిర్వాహకుడైన అక్కడి గ్రామస్థాయి నాయకుడితో అంటోంది. అనగా ఆ సభకు వచ్చినందుకు గానూ కూలి డబ్బులు అడుగుతోందన్నమాట. అదే మహిళ సాయంత్రంవేళ మరో ప్రధాన పార్టీ కార్యక్రమానికి హాజరైంది. ఇలా రోజువారీ కూలీలందరూ ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో మమేకమవుతున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ మద్దతుగా నిర్వహించే సభలు, సమావేశాలు, రోడ్ షోలలో పాల్గొంటున్నారు.



ఇంకా నాలుగు రోజులే..

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. ఈ నాలుగు రోజులు బరిలో ఉన్న అభ్యర్థులతోపాటు నాయకులు కార్యకర్తలు బిజీబిజీగా ఉన్నారు. ప్రచారంలో భాగంగా ముఖ్య నేతలు హాజరయ్యే సభలకు ఆయా పార్టీల శ్రేణులు భారీగా జన సమీకరణ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. సభలు, సమావేశాలు, బహిరంగ సభలు, రోడ్‌షోలకు ప్రజలను తీసుకురావాల్సిన అవసరం ఉంది. అయితే సభల నిర్వహణ బాధ్యతలను చూసుకొనే నాయకులు జన సమీకరణలో భాగంగా కూలీలను తీసుకొస్తున్నారు. ఇందులో భవన నిర్మాణ, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలందరూ ప్రచార కార్యక్రమాల్లో బిజీబిజీగా ఉన్నారు. ఉదయం సభకు వచ్చి.. సాయంత్రం రోడ్‌షోలకు హాజరవుతున్నారు. గ్రామాలకు వచ్చే నాయకులకు స్వాగతం పలకడం, ర్యాలీ తీయడం వంటి కార్యక్రమాలకు అవసరమయ్యే మహిళలు.. జెండాలు మోసేవారు, బైక్ ర్యాలీల కోసం కూలీలను సంప్రదిస్తున్నారు.

పనులకు విరామం..

వ్యవసాయ, భవన నిర్మాణ పనులకు వెళితే రోజంతా కష్టపడాల్సి ఉంటుంది. అదే ఎన్నికల ప్రచారంలో రెండు గంటలు పాల్గొంటే సరిపోతుంది. దానికి తోడు టిఫిన్, భోజన సౌకర్యాలు కూడా ఉంటాయి. కూలీ డబ్బులు కూడా వెంటనే ఇచ్చేస్తారు. దీంతో వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ పనులకు వెళ్లేవారు కూడా ఈ ప్రచార కార్యక్రమాల్లో పార్టీ కండువాలతో దర్శనమిస్తున్నారు. ప్రచార రథం ముందు ర్యాలీగా వెళ్లడం, మహిళలు ముందర నడవడం, వెనకాల పార్టీ జెండాలను మోయడానికి మగవారు.. గుంపులు గుంపులుగా కనిపించేలా ప్రధాన పార్టీల నాయకులు జన సమీకరణ చేస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల వారు, దినసరి కూలీలు, రోజంతా చేసే కష్టపడి చేసే పనులకు బదులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడమే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కూలీలు దొరుకుతలేరు..



పత్తి పంట చేతికొచ్చింది. ఈ సమయంలో పత్తి ఏరాల్సి ఉంది. కూలీల కొరతతో పత్తి ఏరుడు అయితలేదు. గతేడాది ఇదే సమయానికి మొదటి దశ పత్తి ఏరడం పూర్తయింది. ఒకవైపు మబ్బులు వస్తున్నయ్. వాన పడితే పత్తి తడిసి నల్ల బడి నష్టపోతాం. కూలీల కొరతతో ఏం చేయలేకపోతున్నాం. – రవి, రైతు, లంగ్డాపూర్, నిర్మల్‌రూరల్ మండలం

కూలీలంతా ప్రచారంలోనే...



నా దగ్గర దాదాపు 15 మంది రోజువారీ కూలీలు పనిచేస్తూ ఉంటారు. భవన నిర్మాణల్లో ప్లంబర్ పనులు చేయిస్తాను. అయితే ప్రస్తుతం నలుగురైదుగురు మాత్రమే పనికి వస్తున్నారు. మిగతా వారందరూ రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొంటున్నారు. అక్కడే వారికి కావాల్సిన కూలి, మందు విందు వంటివి లభిస్తుండడంతో ఎన్నికల పూర్తయ్యే వరకు అవే కార్యక్రమాల్లో ఉండే అవకాశాలున్నాయి. – నిగులపు సతీశ్, ప్లంబర్, నిర్మల్

వ్యవసాయ పనులకు అంతరాయం...

ప్రధాన పార్టీల నాయకులు సభలు, సమావేశాలకు కూలీలను సైతం ఉపయోగించుకుంటున్నారు. ఇదే సమయంలో వరి కోతలు, పత్తి ఏరే పనులు మొదలయ్యాయి. ఎన్నికల కారణంగా కూలీలు దొరకక ఈ పనులకు అంతరాయం కలుగుతోంది. కొంతమంది రైతులు వాయిదా వేసుకుంటున్నారు. ప్రస్తుతం పత్తి చేతికి వచ్చింది. వర్షాలు కురిస్తే పత్తి నల్లబడి రైతులు నష్టపోయే అవకాశం ఉంది. వరి పొలాలు కూడా కోతకు వచ్చాయి. వర్షాలు పడితే గింజలు రాలిపోయే అవకాశం ఉంది. కూలీల కొరత కారణంగా ఈ రెండు పనులకు అంతరాయం కలుగుతోంది.

గోదావరికి కరకట్ట నిర్మిస్తాం..



హాజరైన జనం

- కాంగ్రెస్ గెలిస్తే వాడకో పేకాట క్లబ్
- ముఖ్యమంత్రి కేసీఆర్
- సింగరేణి సమస్యలపై ప్రస్తావన
- సభ విజయవంతంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్

శ్రీరాంపూర్/నస్పూర్: మంచిర్యాల పట్టణానికి వరదలు రాకుండా చుట్టూ కరకట్ట నిర్మిస్తామని, అవసరమైతే వచ్చే వేసవిలోనే ఈ పనులు చేయిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీనిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంచిర్యాల జిల్లా నస్పూర్ కలెక్టరేట్ సమీపంలోని మైదానంలో శుక్రవారం మంచిర్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే వాడకో పేకాట క్లబ్ మొదలవుతుందని, ఇక జనాలు ఇళ్లు అమ్ముకుని పేకాట ఆడుతారని విమర్శించారు. సింగరేణి 134ఏళ్ల క్రితమే నిజాం చేతిలో ఉండేదని, తర్వాత వంద శాతం ఇది రాష్ట్ర సంస్థగా ఉంటే కేంద్రం వద్ద తెచ్చిన అప్పులు తీర్చక కాంగ్రెస్ పార్టీ 49శాతం వాటాను అప్పగించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలు, ఇంటెక్, ఐటెక్ సంఘాలు ఉన్న వారసత్వ ఉద్యోగాలు పోగొడితే తిరిగి తాను ఇప్పించానని తెలిపారు. నేడు 15వేల మందికి కారుణ్య ఉద్యోగాలు కల్పించామని, ఉద్యోగం వద్దనుకుంటే రూ.25లక్షల మొత్తాన్ని కూడా చెల్లిస్తున్నామని అన్నారు. సింగరేణి కార్మికులకు ఆదాయపన్ను మాఫీ చేయాలని మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే తాము తీర్మానం చేసి మోదీకి పంపించామని, ఆయన ఏ మాత్రం పట్టించుకోలేదని చెప్పారు. చివరికి ఆదానీ కోసం ఆస్ట్రేలియా బొగ్గు కొనాలని ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. లాభాల వాటాను 32శాతానికి పెంచామని, దీంతో ఇటీవల దసరా, లాభాల బోనస్ అన్ని కలిపి సుమారు రూ.2లక్షలకు పైగా వచ్చాయని గుర్తు చేశారు. సకల జనుల సమ్మెలో సింగరేణి కార్మికుల పోరాట పటిమను కూడా కేసీఆర్ ప్రస్తావించారు.



సభలో మాట్లాడుతున్న కేసీఆర్

దివాకర్‌రావు వ్యక్తిత్వాన్ని కొనియాడిన కేసీఆర్

సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో దివాకర్‌రావు వ్యక్తిత్వాన్ని కొనియాడారు. దివాకర్‌రావు చాలా మంచివాడని, నిజాయతీ పరుడని, ఎప్పుడూ తనకు వద్దకు సొంత పనుల కోసం రాలేదని, నియోజకవర్గానికి అది కావాలి, ఇది కావాలి అంటూ అభివృద్ధి పనుల కోసమే వచ్చేవారని తెలిపారు. 24 గంటల కరెంటు కావాలంటే దివాకర్‌రావును గెలిపించాలని అన్నారు. కత్తి ఒకరికి ఇచ్చి యుద్ధం ఒకరిని చేయమంటే ఎట్లా అని కేసీఆర్ చెప్పడంతో సభికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. తన ప్రసంగంలో మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి, బోడ జనార్దన్ పేర్లు ప్రస్తావించి వారి వర్గీయుల్లో ఉత్తేజం నింపారు.

పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం

హోరాహోరీగా సాగుతున్న ఎన్నికల ప్రచారంలో గులాబీ బాస్ పర్యటన మంచిర్యాల నియోజకవర్గం శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరు కావడంతో ప్రజాఆశీర్వాద సభ గులాబీ ప్రభంజనాన్ని సృష్టించింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఉదయం 11 గంటలకే సభ జరగాల్సి ఉండగా రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. వాతావరణం మబ్బుగా ఉండి చిరుజల్లులు పడడంతో సభ రద్దవుతుందేమోనని నాయకులు ఆందోళన చెందారు. చివరికి ఆలస్యమైనా సరే కేసీఆర్ సభకు వస్తారని పార్టీ అధిష్టానం నుంచి నుంచి ఆదేశాలు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. సభకు పెద్దయెత్తున జనాలు తరలిరావడంతో సంతోషం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులు కూడా అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఎన్నికల సమయం కావడంతో మండల స్థాయి నుంచి మొదలుకొని పెద్ద సంఖ్యలో నేతలను వేదికపై కూర్చొబెట్టారు. కాగా, జిల్లాలో ఇప్పటికే బెల్లంపల్లి, చెన్నూర్ నియోజవకర్గాల పరిధిలో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు గడ్డం అరవిందరెడ్డి, బోడ జనార్దన్, మధుసూదనచారి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ.వెంకట్రావు, డీసీఎంఎస్ చైర్మన్ లింగన్న, బీఆర్‌ఎస్ నేత విజిత్‌రావు, నస్పూర్, మంచిర్యాల, లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్‌లు ఈసంపల్లి ప్రభాకర్, పెంట రాజయ్య, నల్మాస్ కాంతయ్య, పార్టీ మండల అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ భూమేశ్, నాయకులు వంగ తిరుపతి, సంతోషచారి, సుదమల్ల హరికృష్ణ, డీ.అన్నయ్య, ఏనుగు రవీందర్‌రెడ్డి, గోగుల రవీందర్‌రెడ్డి, పల్లపు తిరుపతి, హైమద్, అత్తి సరోజ, రౌతు రజిత, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రధానికి అభివృద్ధి పట్టదు

- నిర్మల్‌కు రైల్వే లైన్ ఏదీ?
- సైన్స్ సెంటర్, బాసర ఆలయానికి నిధులేవి?
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ప్రధాని నరేంద్ర మోదీకి ఓట్లు తప్ప అభివృద్ధి పట్టదని మంత్రి, బీఆర్‌ఎస్ నిర్మల్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్మల్ ప్రజల ఓట్ల కోసం వస్తున్న మోదీ.. నిర్మల్‌కు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న ప్రధాని నిర్మల్ వస్తున్న నేపథ్యంలో ఆయనకు పలు ప్రశ్నలు సంధించారు. నిర్మల్ జిల్లా, నిర్మల్ నియోజకవర్గ అభివద్ధికి ఒక్క రూపాయి అయినా ఖర్చు చేశారా? బీజేపీతో పైసా లాభమైన జరిగిందా? నిర్మల్‌కు రైల్వే లైన్ ఏమైంది? నిర్మల్‌లో నవోదయ స్కూల్, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు మీకు పట్టదా? నిర్మల్‌లో శాస్త్ర, సాంకేతిక రంగాలను అభివృద్ధి చేసేందుకు సైన్స్ సెంటర్, ప్లానిటోరియం నిర్మాణానికి నిధులు అడిగితే.... హైదరాబాద్‌లో కొత్తగా ఏర్పాటు చేయతలపెట్టిన సైన్స్ సెంటర్ కోసం 25 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తేనే నిర్మల్ సైన్స్ సెంటర్‌కు అనుమతులు, నిధులు మంజూరు చేస్తామని కేంద్రం మెలిక పెట్టిన మాట వాస్తవం కాదా? బాసర జ్ఞాన సరస్వతీ దేవి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రసాద్ స్కీం క్రింద నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేసిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్నా.. నిర్మల్‌కు రూపాయి లాభం కూడా చేయలేదని విమర్శించారు.

మైక్రో అబ్జర్వర్లు నిబద్ధతతో పనిచేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: పోలింగ్ రోజు మైక్రో అబ్జర్వర్లు నిబద్ధతతో పనిచేయాలని జిల్లా సాధారణ పరిశీలకులు రవిరంజన్‌కుమార్ విక్రమ్, కె.గోపాలకృష్ణ అన్నారు. మైక్రో అబ్జర్వర్ల విధులపై సమీకృత కలెక్టరేట్‌లో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సూక్ష్మ పరిశీలకుల విధులు కీలకమన్నారు. చెక్‌లిస్ట్ ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ బూత్‌లో జరిగే పోలింగ్ ప్రక్రియను పరిశీలన చేయడానికి మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరుగుతుందని, బూత్‌లో ప్రతీ అంశాన్ని పరిశీలించాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు ఈనెల 29న డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో హాజరు కావాలన్నారు. పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహణ, మాక్ పోలింగ్ 50 ఓట్లు వేశారా లేదా పరిశీలన చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పీవోకు మాత్రమే సెల్‌ఫోన్ అనుమతి ఉందని, పీవో డైరీలో అన్ని సంఘటనలు ఎప్పటికప్పుడు నమోదు చేసే విధానాన్ని పరిశీలన చేయాలని, పోలింగ్ ఏజెంట్ల హాజరు వంటి వాటిని తప్పక చూడాలన్నారు. ఈవీఎంలు సరిగా అనుసంధానం చేసి మాక్ పోలింగ్ తర్వాత క్లియర్ బటన్ నొక్కారా లేదా పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు పరిశీలన చేయాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లలకు రెండో శిక్షణ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఉంటుందన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ ముగిసిన అనంతరం సాధారణ పరిశీలకులకు రిపోర్ట్ చేయాలని సూచించారు. సమావేశంలో డీఈవో రవీందర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, శిక్షణ మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాధారణ ఎన్నికల పరిశీలకులు



కల్యాణం జరిపిస్తున్న పండితులు

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయ 39వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీనివాసుని కల్యాణమహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. పండితులు చక్రపాణి నర్సింహమూర్తి, సందీప్‌శర్మ ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠం, యజ్ఞం, ధ్వజారోహణం, గరుడపెల్లి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని తిమ్మాపూర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు అంకం రాజేందర్ ఆధ్వర్యంలో ఆలయం వరకు స్వామివారి పట్టు వస్త్రాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఏపీపీఎస్సీ సభ్యుడు రవీందర్‌రావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



ఊరేగింపుగా పట్టువస్త్రాలు తీసుకువస్తున్న భక్తులు

క్లుప్తంగా

10 క్వింటాళ్ల పత్తి దగ్ధం

ఇంద్రవెల్లి: మండలంలోని హీరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లాల్‌టెకిడి గ్రామంలోని రాథోడ్ నాల్‌సింగ్‌కు చెందిన పత్తి పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధమైంది. బాధిత రైతు వివరాల ప్రకారం... ఇంట్లో భద్రపరిచిన పత్తి పంటపై గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పత్తి పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న అర్‌ఐ లక్ష్మణ్, పోలీసులు లాల్‌టెకిడి గ్రామానికి శుక్రవారం చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. పంచనామా నిర్వహించి 10 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధమైనట్లు నిర్ధారించారు. సుమారు రూ.70వేల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

పలువురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటిపై రాళ్లు వేసి కుటుంబీకులపై దాడికి పాల్పడిన పలువురిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్సై జీవీ.రమణారెడ్డి వివరాల ప్రకారం.. పట్టణంలోని చిల్కూరిలక్ష్మీనగర్‌కు చెందిన ఫర్హాన్ అనే వ్యక్తి బాణసంచాలు పేల్చాడు. తన ఇంటి పక్కనున్న ఇమ్రాన్ అలీ భార్య టపాకాయలు ఎవరు పేల్చారని అడగగా ఫర్హాన్ కుటుంబీకులు గౌసియ, ఫిర్దోస్, ఆయెషా, పర్వీన్, కలీమ్, అలీమ్, సల్మా, హకీమ్‌లు వారి ఇంటిపై రాళ్లు రువ్వడంతో పాటు కుటుంబ సభ్యులపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కాంగ్రెస్ నుంచి నలుగురు నేతల బహిష్కరణ

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీకి ఇటీవల రాజీనామా చేసిన ముగ్గురితో పాటు డీసీసీ మాజీ అధ్యక్షుడితో కలిపి నలుగురు జిల్లా ముఖ్య నాయకులను ఆ పార్టీ అధిష్టానం కాంగ్రెస్ నుంచి బహిష్కరించింది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలోకి దిగిన అల్లూరి సంజీవ్ రెడ్డితో పాటు ఆయన వర్గానికి చెందిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, డీసీసీ మాజీ అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండేలను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరించింది. ఈ మేరకు ఆ పార్టీ క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ జి.చిన్నారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సిరికొండ: మండలంలోని ఖానాపూర్ నియోజకవర్గంలోని ఫకీర్‌నాయక్‌తండా, వాయిపేట్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను నిర్మల్ జిల్లా ఎన్నికల పరిశీలకులు గోపాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని సౌకర్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకున్నారు. పోలింగ్ రోజు ఎన్నికల సిబ్బందికి సహకరించాలని గ్రామస్తులను, రెవెన్యూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకురాలికి గాయాలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల్ ఎక్స్‌రోడ్ వద్ద రోడ్డు ప్రమాదంలో ఓ యాచకురాలకు తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ సీఐ పురుషోత్తం వివరాల ప్రకారం... సారంగపూర్ మండలానికి చెందిన గంగవ్వ(65) స్థానిక మంచిర్యాల చౌరస్తా వద్ద భిక్షాటన చేస్తూ జీవించేది. శుక్రవారం మధ్యాహ్న సమయంలో రోడ్డు దాటుతుండగా ఖానాపూర్ వైపు వెళ్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గంగవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

డిగ్రీ విద్యార్థులపై ఫీజుల భారం

- ప్రత్యేక ఫీజులను మూడురెట్లు పెంచిన కాకతీయ యూనివర్శిటీ
- చెల్లించలేని పరిస్థితుల్లో విద్యార్థులు
- ఫీజు చెల్లించకుంటే ఉన్నతవిద్యకు దూరం
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు: 137


కాకతీయ యూనివర్శిటీ

బోథ్: కాకతీయ యూనివర్శిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలో విద్యార్థులపై ఫీజులు గుదిబండగా మారాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి యూనివర్శిటీకి చెల్లించే ప్రత్యేక ఫీజులు పెరిగాయి. గత ఏడాది కంటే మూడు రేట్లు ఫీజులను యూనివర్శిటీ అధికారులు పెంచేశారు. పరీక్ష ఫీజుతో పాటు సంవత్సరానికి కట్టాల్సిన ప్రత్యేక ఫీజును భారీగా పెంచడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కాకతీయ యూనివర్శిటీ పరిధిలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు 137 ఉన్నాయి. డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం పరీక్ష ఫీజుతో పాటు ప్రత్యేక ఫీజును యూనివర్శిటీకి విద్యార్థి చెల్లించాలి. గతంలో ప్రత్యేక ఫీజులో ఏడాదికి ఒకసారి స్టూడెంట్ రికగ్నైజేషన్ ఫీజు రూ.200 నుంచి రూ.400 వరకూ, స్టూడెంట్ వెల్ఫేర్ ఫండ్ రూ.50, ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్ ఫీజు రూ.60 విద్యార్థులు తమ గ్రూపులను బట్టి చెల్లించేవారు. మొత్తం రూ.310 నుండి రూ.510 వరకు ప్రత్యేక ఫీజును చెల్లించేవారు. దీనికి పరీక్ష ఫీజు అదనం కాగా ప్రస్తుతం యూనివర్శిటీ అధికారులు ప్రత్యేక ఫీజు మొత్తాన్ని మూడు రేట్లు పెంచారు. పెంచిన ఫీజుల ప్రకారం ప్రస్తుతం స్టూడెంట్ రికగ్నైజేషన్ ఫీజు రూ.800, స్టూడెంట్ వెల్ఫేర్ ఫండ్ రూ.200, ఇంటర్ టోర్నమెంట్ ఫీజు రూ.300తో పాటు అదనంగా ప్రతీ సంవత్సరం స్టూడెంట్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1200 నిర్ణయించారు. మొత్తం సంవత్సరానికి రూ.2500 ప్రత్యేక ఫీజు రూపంలో యూనివర్శిటీకి చెల్లించాల్సిన పరిస్థితి. ఈ ఫీజుతో పాటు మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫీజు కలుపుకుని రూ.3200 వరకు ప్రతి విద్యార్థి చెల్లించాల్సిన పరిస్థితి.

ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో...

యూనివర్శిటీ అధికారులు ప్రత్యేక ఫీజులు పెంచడంతో విద్యార్థులు లబోదిబోమంటున్నారు. పెంచిన ఫీజును పేద, గిరిజన, ఆదివాసీ విద్యార్థులు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారానే చదువుతున్నారు. తాము చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. కాగా వచ్చే నెల 4వ తేదీలోగా పరీక్ష ఫీజుతో పాటు, ప్రత్యేక ఫీజును చెల్లించాలని యూనివర్శిటీ అధికారులు పేర్కొంటున్నారు.

ఫీజులు చెల్లించలేని పరిస్థితి..



ప్రత్యేక ఫీజులు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నాం. మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫీజును చెల్లించాలంటేనే ఇబ్బందిగా ఉంది. వాటితో పాటు ప్రత్యేక ఫీజు రూ.2500 చెల్లించాలంటే చాలా కష్టం. మాలాంటి పేద విద్యార్థులకు ప్రత్యేక ఫీజులు విద్యకు దూరం చేసే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం స్పందించి ప్రత్యేక ఫీజులను తీసివేసేలా చర్యలు తీసుకోవాలి.

– సాయి చరణ్ పాటిల్, డిగ్రీ విద్యార్థి

ప్రత్యేక ఫీజు తగ్గించకుంటే ఆందోళన చేస్తాం



కాకతీయ యూనివర్శిటీ అధికారులు ప్రత్యేక ఫీజు పెంచడం దారుణం. ఫీజులు విద్యార్థులకు భారంగా మారుతున్నాయి. పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నారు. ప్రత్యేక ఫీజు, మొదటి సంవత్సరంలో రెండు సెమిస్టర్లకు కలిపి దాదాపు రూ.3900 కట్టాల్సి వస్తుంది. వెంటనే ఫీజులు తగ్గించాలి. లేకపోతే ఆందోళనలు తప్పవు.

– అకాష్, ఏబీవీపీ నాయకుడు

ఫీజులు తగ్గించాలి



యూనివర్శిటీ ప్రత్యేక ఫీజు తగ్గించాలి. గతంలో తక్కువగా ఉన్నప్పుడే ఫీజు చెల్లించడానికి ఇబ్బందులు పడ్డాం. ఆ ఫీజును మూడు రేట్లు పెంచడం అన్యాయం. ఫీజు కట్టలేని పరిస్థితులో ఉన్నాం. విద్యార్థులను ఇబ్బందులు పెట్టకూడదు. పరీక్ష ఫీజుతో ప్రత్యేక ఫీజును చెల్లించాలని చెబుతున్నారు. పరీక్ష ఫీజు చెల్లించకుంటే విద్యా సంవత్సరం కోల్పోవాల్సిన పరిస్థితి.

– బొడ్డు నితిన్, డిగ్రీ విద్యార్థి

అతిరథులొస్తున్నారు

- నేడు ఆదిలాబాద్‌కు రాహుల్.. సిర్పూర్‌కు యోగి రాక
- రేపు నిర్మల్‌కు ప్రధాని మోదీ.. ఖానాపూర్‌కు సీఎం కేసీఆర్
- త్వరలో మంచిర్యాలకు అమిత్‌షా..


ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రాహుల్‌గాంధీ సభ కోసం ఏర్పాటు చేసిన వేదిక

సాక్షి, ఆదిలాబాద్: అతిరథ మహారథులు వస్తున్నారు. ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరుకోగా, జాతీయ నేతల వరుసపెట్టి వస్తున్నారు. శనివారం ఆదిలాబాద్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విచ్చేయనున్నారు. సిర్పూర్ కాగజ్‌నగర్‌కు బీజేపీ తరఫున ప్రచారం చేసేందుకు ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వస్తున్నారు. ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్మల్ పర్యటన ఖరారైంది. ఇదేరోజు సీఎం కేసీఆర్ ఖానాపూర్‌లో పర్యటిస్తున్నారు. ఒకే రోజు నిర్మల్ జిల్లాలో అటు ప్రధాని, ఇటు సీఎం పర్యటనలు ఉండటం గమనార్హం. దీంతో బందోబస్తు చర్యలు చేపట్టడం పోలీసులకు సవాలుగా మారనుంది.

కేసీఆర్ పది నియోజకవర్గాల్లో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటనలు సంపూర్ణం కానున్నాయి. ఆదివారం ఖానాపూర్ సభ పూర్తయితే పది నియోజకవర్గాల్లో ఆయన పర్యటించినట్లు అవుతుంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లాలో సగం నియోజకవర్గాల్లో తిరిగారు. బెల్లంపల్లి, ఖానాపూర్, ఆదిలాబాద్, నిర్మల్, బోథ్‌లలో ఇప్పటివరకు ఆయన పర్యటనలు పూర్తయ్యాయి. మిగిలిన రోజుల్లో మరికొన్ని నియోజకవర్గాల్లో ఆయన పర్యటించే అవకాశాలున్నాయి. మంచిర్యాలలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన ఉంటుందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఇటీవలే కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో పాల్గొన్నారు.

మరికొంత మంది నేతలు..

ఎన్నికల పోలింగ్ 30వ తేదీన ఉండగా, 48 గంటల ముందుగా ప్రచార పర్వం ముగుస్తోంది. 27న సాయంత్రంతో పార్టీల ప్రచారం పూర్తి కానుంది. అంతలోపే జాతీయ, రాష్ట్ర నేతలు విస్తృతంగా ఉమ్మడి జిల్లాలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖానాపూర్ రోడ్‌షోలో త్వరలో పాల్గొననున్నారు. మహారాష్ట్ర సీఎం ఏకనాథ్ షిండే బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారంలో భాగంగా జిల్లాలో ఒకట్రెండు రోజుల్లో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. బీజేపీ పరంగా ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉమ్మడి జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఏసీబీ వలలో చింతలమానెపల్లి ఎస్సై

- రూ.20వేల లంచం కోసం వేధింపులు
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు

చింతలమానెపల్లి(సిర్పూర్): లంచం కోసం యువకుడిని వేధించిన చింతలమానెపల్లి ఎస్సై ఏసీబీకి పట్టుబడటం స్థానికంగా కలకలం సృష్టించింది. కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండల ఎస్సై ఎస్.వెంకటేశ్, హోంగార్డ్ జనార్దన్ శుక్రవారం లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ రమణామూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానెపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన ఓ వివాహిత కుటుంబ కలహాలతో గత నెల 2న ఇంటి నుంచి వెళ్లిపోయింది. మహారాష్ట్రలోని అహేరి పట్టణానికి అమె వెళ్లేందుకు దిందా గ్రామానికి చెందిన యువకుడు డోకె ప్రశాంత్ సహకరించాడు. పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు కాగా.. కొద్దిరోజుల అనంతరం సదరు వివాహిత ఇంటికి తిరిగి వచ్చింది. ఈ ఘటనలో రూ.70వేల లంచం ఇవ్వాలని ప్రశాంత్‌ను ఎస్సై వెంకటేశ్ వేధించాడు. అడిగినంత ఇవ్వకుంటే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తానని బెదిరించాడు. బేరసారాల మధ్య ప్రశాంత్ రూ.20వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు. అయితే లంచం ఇవ్వలేని పరిస్థితిలో ఉన్న ప్రశాంత్ గత్యంతరం లేక ఏసీబీని ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వల వేసి ఎస్సైని పట్టుకున్నామని డీఎస్పీ వెల్లడించారు. ఎస్సై డిమాండ్ చేసిన నగదును మధ్యవర్తి డోకె శ్రీనివాస్ చింతలమానెపల్లి మండల కేంద్రంలోని ఓ ఇంటి వద్ద హోంగార్డు జనార్దన్‌కు ఇస్తుండగా పట్టుకున్నామని డీఎస్పీ తెలిపారు. పూర్తి వివరాలు సేకరించి ఎస్సై వెంకటేశ్, హోంగార్డు జనార్దన్‌ను శనివారం ఏసీబీ కోర్టులో ప్రవేశపెడతామని ఆయన పేర్కొన్నారు. లంచం కోసం ఎవరైనా వేధిస్తే ఏసీబీని 9154388963 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు. ఈ దాడిలో ఎస్సైలు రాము, జాన్సన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ


స్వాధీనం చేసుకున్న నగదు


ఎస్సై వెంకటేశ్

ప్రపంచ రికార్డు సాధించిన అద్వైరుషి

- అభినందించిన జిల్లా ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన రెండేళ్ల వయస్సు గల అద్వైరుషి అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచంలోని అత్యధిక మేధస్సు కలిగిన చిన్నారుల్లో ఒకరిగా నిలిచాడు. ఈ నెల 1న నోబెల్ వరల్డ్ రికార్డు సంస్థ యంగెస్ట్‌టోడ్లర్ విత్ హైమెమోరి పవర్ అనే అంశంపై ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. పట్టణానికి చెందిన నటరాజ్ – కీర్తి దంపతుల కుమారుడైన ఈ చిన్నారి ప్రతిభ కనబర్చాడు. ఫజిల్స్‌ను సెకండ్ల వ్యవధిలో పూర్తి చేయడం, ఇంగ్లీష్ అక్షరాలు, సంఖ్యలు, పండ్లు, కూరగాయలు, రంగులు, ఆకారాలు, జంతువులు, వాహనాలు, శరీర భాగాల పేర్లు చెప్పగల సామర్థ్యం ఈ బాలుడి సొంతం. ఇటీవల ఈ బాలుడు ప్రతిభకనబర్చినట్లు ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్ పంపించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు.


అద్వైరుషికి అవార్డు అందిస్తున్న ఎస్పీ

పోస్టర్లు ముద్రించిన ఇరువురిపై కేసు

కైలాస్‌నగర్: ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా కరపత్రాలను ముద్రించి పంపిణీ చేసినందుకు రిటైర్డు ఎంఈఓ నూతుల దయాకర్‌రెడ్డి, పట్టణంలోని 35వ వార్డు బీఆర్‌ఎస్ ప్రెసిడెంట్ అతీకుర్ రహమాన్‌లపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు ఆదిలాబాద్ రిటర్నింగ్ అధికారి స్రవంతి ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎవరైనా ప్రకటనలు, కరపత్రాలు, పోస్టర్లు ముద్రించడం, ప్రచారం చేసేందుకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా పోస్టర్లు ముద్రించి ప్రచారం చేస్తే ఈసీ ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఊరు సొనాల.. పోలింగ్‌బూత్ కుచులాపూర్


సొనాలలో ఓటరుకు కుచులాపూర్ పోలింగ్ కేంద్రంతో ఉన్నట్లు చూపిస్తున్న ఓటరుకార్డు

బోథ్: అధికారుల అలసత్వం ఓటర్లకు శాపంగా మారింది. సొనాల గ్రామానికి చెందిన ఓటరు అజయ్ జటాల తన ఓటరు కార్డు చూసి ఖంగుతిన్నాడు. భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్ నుంచి తన ఓటరు కార్డును డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ఓటరు కార్డు చూడగానే తాను ఓటు వేసే పోలింగ్ స్టేషన్ కుచులాపూర్ గ్రామంలోని 240వ పోలింగ్ స్టేషన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అని ఉంది. సొనాల గ్రామానికి చెందిన తనకు కుచులాపూర్ గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. కాగా సొనాల గ్రామ ఓటరుకు 240వ పోలింగ్ కేంద్రమైన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వేయడం చూస్తే అధికారులు ఏ స్థాయిలో ఓటరు ప్రక్రియ చేపట్టారో అర్థమవుతోంది.

ఎమ్మెల్యేను నిలదీసిన గ్రామస్తులు


విఠల్‌రెడ్డిని నిలదీస్తున్న గ్రామస్తులు


మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

- ప్రచార సభలో ఆగ్రహించిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామానికి ముథోల్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి విఠల్ రెడ్డి ఎన్నిల ప్రచారం నిర్వహించడానికి శుక్రవారం వచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా విఠల్‌రెడ్డి ప్రసంగిస్తుండగా కొందరు గ్రామస్తులు సభను అడ్డుకుని పిప్రి ఎత్తిపోతల పథకంపై పనులు నేటికీ పూర్తి కాలేదని, గ్రామానికి ఏమి చేశారని ఎమ్మెల్యేను నిలదీశారు. నేను మాట్లాడిన తరువాత ఎన్ని ప్రశ్నలైనా అడగండి అని ఎమ్మెల్యే పదేపదే గ్రామస్తులను కోరాడు. కానీ గ్రామస్తులు కేరింతలు పెట్టడంతో మీరు మొండి అయితే నేను జగమొండి నని ఆగ్రహంతో చెప్పారు. గ్రామంలో ఎన్ని సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సముదాయించారు. ఈ ఎన్నికల్లో నేను గెలిచిన తరువాత గ్రామంలోని ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయించి గ్రామం అంతటికీ సాగు నీరందిస్తానని చెప్పడంతో గొడవ సద్దుమనిగిపోయింది. అనంతరం ప్రచారాన్ని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ముగించారు. ఆయన వెంట మాజీ జెడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, సర్పంచ్ ముత్తవ్వ, ఎంపీటీసీ సభ్యురాలు మగ్గిడి రాణి ఉన్నారు.

మద్యం పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్ వివరాల ప్రకారం.. పట్టణంలోని వినాయక్‌చౌక్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదిలాబాద్ రూరల్ మండలం మొలాల్‌గుట్టకు చెందిన బాలు అనే వ్యక్తి బెల్టుషాప్ నిర్వహణ కోసం రూ.5600 విలువ గల 43 మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా శ్రీలక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం


కల్యాణ మహోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

జైనథ్: మండల కేంద్రంలో కొలువుదీరిన అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ ఆరాధ్యదైవమైన శ్రీలక్ష్మీనారాయణస్వామి వారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం కార్తీక శుద్ధ ద్వాదశి రోజున రాత్రి అంగరంగా వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాక, మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి నిత్యహవణం, ధ్వజారోహణం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న సమయంలో భక్తులకు నగర భోజనాన్ని ఏర్పాటు చేశారు. సంతానం లేనివాళ్లకు సంతానం కలగాలని ప్రత్యేకంగా పూజలు చేసి గరుడ ప్రసాదాన్ని అందించారు. భక్తులు ఎంతో తన్మయత్వంతో చూస్తుండగా అర్చకులు స్వామివారి కళ్యాణోత్సవాన్ని వేదమంత్రాల నడుమ నిర్వహించారు.

చిన్నారి బాగోగులకు హామీ..


చిన్నారి ప్రతికతో రంజిత్‌రెడ్డి

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ అనుబంధ గ్రామం చర్లపల్లికి చెందిన న్యాకపు భీమన్న-లక్ష్మి దంపతులు అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మరణించారు. వీరి ఆరేళ్ల కూతురు ప్రతిక అప్పటి నుంచి తల్లిదండ్రులు లేక బంధువుల ఇంట్లో ఉంటోంది. శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కొమ్ముల దేవేందర్‌రెడ్డి ఈ విషయాన్ని బీఆర్‌ఎస్ పార్టీ దిలావర్పూర్, నర్సాపూర్(జి) మండలాల ఇన్‌చార్జి రంజిత్‌రెడ్డికి తెలిపాడు. స్పందించిన ఆయన చిన్నారికి సంబంధించిన బాగోగులు చూస్తానని హామీ ఇచ్చాడు. అందుకు బీఆర్‌ఎస్ నాయకులు అతడిని అభినందించారు.

133 ఎక్సైజ్ కేసులు.. 17 మంది అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గత నెల 9నుంచి ఇప్పటి వరకు 133 కేసులు నమోదు చేసి 17మందిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఇందులో గత నెల 9వ తేదీ నుంచి శుక్రవారం వరకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పలు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గుడుంబా తయారీకి ఉపయోగించే 23,650 లీటర్ల ఇప్పపువ్వు పానకాన్ని ధ్వంసం చేశామని, 34లీటర్ల గుడుంబాను స్వా ధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై దాడులు చేసి 136.8 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని, 42 గంజాయి మొక్కలను ధ్వంసం చేసి 10.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. 697.53 లీటర్ల దేశీదారు స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనధికారికంగా నిర్వహిస్తున్న 678 లీటర్ల తెల్లకల్లును ధ్వంసం చేసి కేసు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. 3కార్లు, బైక్ సీజ్ చేసినట్లు తెలిపారు. నకిలీ మద్యం గుర్తించేందుకు ప్రభుత్వం వీఈఆర్ ఐటీ యాప్‌ను రూపొందించిందని, బాటిల్‌పై గల స్టిక్కర్‌పై ఉన్న బార్‌కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ బాటిల్ పూర్తి సమాచారం తెలుస్తుందని తెలిపారు. అక్రమ మద్యానికి సంబంధించి సెల్: 8712658780పై సమాచారం అందించాలని కోరారు.

అర్లి(టి)లో కార్తీక గిరి ప్రదక్షిణ


ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

తాంసి: కార్తీక మాసం పురస్కరించుకుని భీంపూర్ మండలం అర్లి(టి) గ్రామంలో గిరిప్రదక్షిణ పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. గ్రామ శివారు గుట్టపై ఉన్న రామాలయంలో శివానంద భారతిస్వామి ఆధ్వర్యంలో ఏటా చతుర్మాస పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా రాములగుట్ట నుంచి గ్రామం వరకు డప్పుచప్పుళ్ల నడుమ కలశాలతో ఊరేగింపు చేపట్టారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ లస్మన్న, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామయ్య, సభ్యులు ఉల్లాస్, నితిన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యకర్త అభిమానం

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జోగు రామన్నపై అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన సంజయ్ శుక్రవారం ఎమ్మెల్యే చిత్రాన్ని తన చేతిపై ట్యాటూ వేయించుకున్నాడు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జోగు రామన్న ట్యాటు వేసే దుకాణానికి చేరుకొని సంజయ్‌ని అభినందించారు.


సంజయ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే రామన్న